# మాయరోగం

నా మొగుడు నన్ను వదిలేశాడు! బాధపడలేదు. పోతేపోయినాడులే ఎదవసన్నాసి అని సరిపెట్టుకున్నాను. నన్ను వదిలేస్తేనేం వదిలేయకుంటేనేం?... దమ్మిడీకి పనికిరాని తాగుబోతు ఎదవ! బంగారంలాంటి వుద్యోగంచస్తూ నెలకి అయిదారువేలు సంపాదిస్తున్నా... పెళ్లాం సంపాదనతో ఇంటిన పడి తింటూ ఆడి జీతమంతా జల్సాగ ఖర్చుపెట్టుకునే ఎదవ మొగుడని చెప్పుకోటానికే సిగ్గు సిగ్గు!

మడేలు... అదే నా పెనిమిటి సదువుకున్నాడే! అంటే కాలేజీలో సతికిన సతుకేం కాదు! పదో తరగతి పదిసార్లు తప్పి ఓ మహానుభావుడి దయతో ప్రభుత్వాఫీసులో అటెండరు వుద్యోగం ఎలగబెడుతూ నా పాలిట పడ్డాడు! మడేలు పనికి మాలిన వాడని... చెడ్డ అలవాట్లు కలవాడని ముందే తెలిస్తే నేను అట్టాంటోడిని మనువాడి వుందునుకాదు!. తీరా పెళ్లి అయ్యాక గాని అయ్యగారి బాగోతం గురించి వివరంగ తెలవలేదు.

వాడికున్నన్ని చెడు వ్యసనాలు ఈ భూమ్మీద ఎవరికీ వుండవన్పిస్తుంది. ఒక్కరూపాయి వాడి సంపాదనలో ఇంటి కరుచుకీయడు. అదేమంటే నువ్వు నలుగురి ఇళ్లల్లో చాకిరీ చేసి సంపాయిస్తూండావుకదా... ఇక నేనేంటి ఇచ్చేది అంటాడు. ఛీ! ఆ మడిసిని చూస్తుంటే అస్యమేస్తోంది. ఒక మగనలుసు కలగకపోతే... నేనే మడేలుని వదిలేసి హాయిగా ఇంకోడిని కట్టుకుని వుండేదాన్ని! ఏం? మగాడికున్న సొతంతరం ఆడోళ్లకుండదా? మగాడు ఎన్ని పెళ్లిళ్లైనా చేసుకోవాచ్చా?... ఎందరితోనైనా కులకచ్చా?... మాగాడికోనీతి... ఆడదానికి మరొకటేనా?... చెడుకైనా మంచికైనా అందరూవకటే! తేడా ఏం వుండదు. నాకు సదువులేకపోయినా.... నాకు అన్నీ తెలుసు!

రామాయణ... భారత.... భాగవతాలు... అయ్యోరు మావూరి గుడిలో పురాణం సెప్తూంటే వినేదాన్ని ! బండికంటూ వెళ్లి సదువుకోలేదన్నమాటేగాని నాకు తెలవని ఇసయంలేదు. అదేమంటే... నాకు సదువురాదని... సదువుకోలేదని ఎప్పుడూ ఎగతాళే! పెద్ద సినిమా హీరోలాగ పోజొకటి?- అద్దం ముందు నిలబడి గంటల తరబడి దువ్వుకుంటూ అక్కడినుంచి కదలడు.

ఆడోళ్లు వెంట్రుకలు చిక్కుతీసుకుని జడ అల్లుకోవటమైనా పదినిముషాల్లో అయిపోతుందేమోగాని... నా మొగుడు... అదే... మడేలు ఎదవ... జుట్టు దువ్వుకుంటూ... మీసం మెలేసుకుంటూ... నవ్వుకుంటు... పోజులిచ్చుకుంటూ కొక్కొరాయి వేషాలు వేస్తూండటం చూస్తే నాకు వళ్లుమండుద్ది!.

నన్ను పిలగాడిని సున్నిపిండితోనో... సీకాయతోనో తల వళ్లు రుద్దుకుని స్నానం చెయ్యమని సలహా ఇచ్చే ఎదవకు ఖరీదైన సబ్బు... ముఖానికి పౌడరు మాత్రం ఆడి సంపాదనతో తెచ్చుకుని దాచుకుని వాడొక్కడే వాడుకుంటాడు.

'ఇదిగో నువ్వు వాటిజోలికిపోతే కాళ్లిరగ్గొడతాను...' అంటూ తిడతాడు.

పెళ్లై పదేళ్లయినా సోకులకేం తక్కువలేదు. చీకటి పడితే చాలు బుడ్డి బిగించాల్సిందే. అదీ ఖరీదైన సరుకు!

ఎందుకయ్యా డబ్బుతగలేసి అంత కరీదైన మందు తాగకపోతేనేం?... నాటుసారా... అదే గవర్నమెంటోళ్లు అమ్మేది... దాన్ని తాగి తృప్తిపడితే డబ్బు ఆదా అవుద్ది కదయ్యా అంటే చాలు.. నామీదకు వొంటికాలిమీద లేస్తాడు. జుట్టు పట్టుకుని వీపుమీద పిడిగుద్దుల వర్షం కురిపిస్తాడు.

ఇట్టాంటి పాపిట్టోడితో సంసారం సెయ్యలేక చస్తున్న నాకు... నా మొగుడు నన్నొదిలేసి మంచి పని చేశాడు. నా నెత్తిన పాలుపోశాడు!. కష్టాలు తప్పించాడు! కాయకట్టంసేసి నేను నా కొడుకు హాయిగ బతగ్గలం!. పిలగాడినైనా సక్కగ సదివించి పెద్దోడిని చేత్తే... నా బతుకు తల్లారిపోద్ది! తలరాత మారుద్ది !

నన్నూ తాగమని బలవంతం చేసేవోడు. పాణాలు తోడేసేవోడు. ఇద్దరికీ ఈ విషయంలో ఎప్పుడూ గొడవే!. కాదూ కూడదని ఓకరోజు మొండికేస్తే... గరిటె కాల్చి వాత పెడతానంటూ కళ్లెర్ర చేశాను. అది సతా నన్ను తాగమనడు. అయినా ఆడది తాగటమేంది?... చండాలంగ! అదేమంటే... ఆడోళ్లు తాటం ఫాషనంట!. ఇదేం మాయదారి ఫాషనో?

నా మొగుడు మడిసైతేగా?... రాచ్చసుడు! కితంజనమలో రావణాసురుడో... హిరణ్యకసిపుడో... వాళ్ల వారసుడో అయివుండాలి!... ఈ జనమలో నాకు మొగుడై చెండుకు తింటా వున్నాడు.

ఏ పెళ్లామైనా ఇట్టాంటి మొగుడు కావాలనుకుంటుందా?. నిజంగా నా మొగుడు

మెంటలోడే!... చేసేది ప్యూను వుద్యోగమే అయినా... అక్కడికి తానేదో ఆఫీసరైనట్టు ఎదవ్వేసాలేస్తాడు. ఈడి జిమ్మడిపోను!

మొగుడు వదిలేత్తే వదిలేసిండు!... నేనూ పిలగాడు అయినా దర్జాగ బతకాల!.... బీడీలు చుట్టటానికెళ్లి రోజుకో యాభై సంపాదించేది సాలక... అగ్గిపుల్లల ఫ్యాక్టరీలో చట్రాల్లో పుల్లలు పెడితే కూడా డబ్బిత్తారని తెలియటంతో రోజూ ఇంటికొస్తూ నాలుగైదు చట్రాలు... పుల్లలు తెచ్చి నడిరేతిరి దాకా పుల్లలను చట్రాల బొక్కల్లో గుచ్చి ఫ్యాక్టరీ వాళ్లిచ్చిన మందు ద్రావంలో ముంచి... తెల్లారి పనికెడుతూ చట్రాలను అప్పగించి తిరిగి మళ్లీ వచ్చేటపుడు ఖాళీచట్రాలు తెచ్చుకుంటూ నెలకు అయిదొందలు తెచ్చుకోగలుగుతున్నాను.

నన్నొదిలేసి ఎవతెనో కుర్రదాన్ని తగులుకుని దాంతో వుంటున్నట్టు చూసినోళ్లు నాతో చెప్పారు. ఇంటికి రావటం... నాకంటికి కన్పించటం మానేశాడు. నాకే బాధన్పించలేదు. పీడవదిలింది అంతే చాలనుకున్నాను. ఆనాడు దగ్గరకు తీసిన ఆ మడిసి తిరుగుబోతని తెలిసింది. నా మొగుడుని ఎదవని చేసి నెలజీతం అదే లాక్కుంటూవుందనీ విన్నాను. అట్టాంటి అడదైతేగానీ ఆడిరోగం కుదరదు.

X X X

కొడుకును కాన్వెంట్లో చేర్పించాను. పిల్లోడు తెలివిగలోడని టీచర్సు మెచ్చుకుంటుంటే తెగ మురిసిపోయాను.

బీడీ ఆకు వాసన నావంటికి సరిపడకపోవటంతో ఆడ పని మానుకోక తప్పలేదు. కేవలం అగ్గిపుల్లలు గుచ్చటం మీద వచ్చే ఆదాయం సరిపోవటంలేదు.

ఒకరోజున నాకేదైనా సీపరుగాని ఆయా వుద్దోగం గాని ఇయ్యమని కాన్వెంటు న్కూలు పెద్దాయన కాళ్లమీద పడ్డాను. నా పరిస్థితి చూచి కాదన్లేక వుద్యోగమిచ్చాడాయన. నెలకు మూడువేలు జీతం!. పిల్లగాడు ఆడనే చదువుకుంటున్నాడు గదాని ఆడికి ఫీజు కట్టించుకోవటంలేదు. అది నాకు జరిగిన పెద్ద సాయం. పిల్లాడికి యూనిఫారం కాకుండా బైట వేసుకోవటానికి మంచి బట్టలే కుట్టిస్తావుండాను. నా బిడ్డ దొరబాబులా వున్నాడు. అంతా నాపోలికే!.

ఇప్పుడు నాకే చీకు చింతా లేదు! బతుకు సుకంగ గడుస్తావుంది. పిల్లగాడి గురించి దిగులులేదు. ఆడు బాగా చదివి పెద్దాడై మంచి వుద్దోగస్తుడైతే నాకు

అంతకంటే ఏంకావాలన్పించింది. నన్ను కొడుకు సుకపెడతాడు. ఈడి అయ్యకు ఆ అదురుష్ఠం లేకపోయె?

ఒకరోజున నాకు బాగా పరిచయమున్న సత్తెమ్మ నాకాడికొచ్చి 'నీకో ఇసయం సెప్పాలే ఆదెమ్మా...' అంది.

'చెప్పరాదంటే...' చాటలో వున్న బియ్యంలో రాళ్లేరుతూ అన్నాను.

'నీ పెనిమిటికి వంట్లో బాగోక ఆసుపత్రిలో చేరినాడంట!... నీకీ విషయం తెలవదా?-' అంది

'వాడికేం మాయరోగం?- అయినా నన్ను కాదని వదిలేసి ఎల్లిపోయినోడి గురించి నాకేటి బాద? నొసలు చిట్లించాను.

'ఎంతైనా మొగుడు కదంటే... సావు బతుకుల్లో వున్నప్పుడైనా ఎల్లి సూసిరావటం దర్మం...'

'ఏ ఆసుపత్రిలో వున్నాడు ఆడు?-' అయిష్ఠంగానే అడిగాను.

'అదేనే ధర్మాసుపత్రి!'

'ఇంతకూ ఏంరోగమంటా?. నన్ను కాదని మరో ఆడదాన్ని దగ్గరకు తీశాడుగా... అది వాడిని చూసుకోవటం లేదా?-''

'అదంతా ఎందుకు అడుగుతావులే!. ఆ తర్వాత ఇద్దరి ముగ్గర్ని మార్చాడంట!. ఎవరూ ఆడికాడ నిలకడగా టేరంటగా...'

'ఎట్టావుంటార్లే అత్తమ్మా!... ఆడొట్టి ఎదవైతే నేను మంచిదాన్ని... నోరులేని దాన్ని గనుక ఆడుకొట్టినా... తిట్టినా... తిండిపెట్టినా పెట్టకున్నా... పదేళ్లు కాపురం చేసినా! అంతా నాకు మల్లే సద్దుకుబోయే వాళ్లుంటారా ఏంది?'- నొసలు చిట్లించి మెటికలు విరిచాను.

'అయిందేదో అయిపోయింది ఇప్పుడు నీ మొగుడు రోగంతో ఆసుపత్రిలో వున్నాడు. వుంచుకున్నోళ్లంతా తాళికట్టిన పెళ్లాంతో సమానం కాలేరుగా... నీకెట్టాగూ తప్పదు. ఎంత కాదనుకున్నా... పాపభీతితో మనసు పీకుతుందికదే.... ఓమారెల్లి చూచిరా... వాడు రానన్నా ఇంటికి తెచ్చుకో!... ఇప్పుడు నీ పరిస్థితి బాగానే వుందిగా...' రాగాలు తీస్తూ నీతులు వల్లించి... ధర్మసూత్రాలు చెప్పింది సత్తెమ్మ.

'సర్లే... ఓసారి పోయొత్తాలే...' ఆ ముదరట్టపోడిని ఇంటికి తెచ్చుకుని కొరివితో

తలగోక్కోలేను...' చెరిగిన బియ్యం గిన్నెలో పోస్తూ బదులిచ్చాను.

ఇంతలో నా బిడ్డ కాన్వెంట్ నుంచి రానేవచ్చాడు. మరునాడు సత్తెమ్మను వెంటతీసుకుని దరమాసుపత్రికి ఆడిని సూసొద్దామని ఎల్లాను.

వార్డులన్నీ తిరిగి చివరికి ఓ మూల బెడ్‌మీద ప్రాణాలు కళ్లల్లో పెట్టుకుని శవంలా పడివున్న మడేలు అవుపించాడు. చూడగానే ఆడిని పోల్చుకోలేకపోయాను. మడిసి బాగా పాడైపోయాడు. ఏనుగులాంటోడు పీనుగయ్యాడేంటి?- ఈడికి కూడు పెట్టేవోళ్లు కూడా లేకుండాపోయారా?. అందరూ వీడి సంపాదనకు ఆశపడి దగ్గరై... మూడునాళ్ల ముచ్చట చేసి దులుపుకుని వెళ్లిపోయివుంటారు. ఈడి పొగరు అణిగిందన్నమాట!. కడాకు నేనే గతై వుంటాను. అందుకే నా కోసం సత్తెమ్మ ద్వారా రాయబారం నడిపుంటాడు. ఇప్పుడు!... ఈ స్థితిలో తాళి కట్టిన పెళ్లాం గురుతొచ్చి కావలసి వచ్చిందన్నమాట యదవకు!. హుషారుగ వున్నన్నాళ్లూ కన్నుమిన్నుగానరాలేదు. రోగంతో ఆస్పత్రి పాలైనప్పుడు నేను గుర్తుకొచ్చాను చిచ్చినోడికి....

నన్ను చూచి ఆనవాలుపట్టి... ఓపికలేనట్టు సన్నగా నవ్వాడు. దగ్గరకు రమ్మంటూ తలాడించి సైగచేశాడు మడేలు.

'సూడవే!... నీ మొగుడ్ని సూడు!... చిక్కి బలపమైపోయాడు. ఆ ముండలంతా వీడికాడ డబ్బుకోసం చేరారు... వీడిని పీల్చి పిప్పిచేసి రోగం వచ్చిందని తెలీగానే చెట్టుమీద కాకుల్లాగ ఎవరిమటుక్కు వాళ్లు వెల్లిపోయారు-' బుగ్గలు నొక్కుకుంది సత్తెమ్మ.

మంచం దగ్గరగా వెళ్లి నిలబడ్డాను. వాడేదో చెప్పాలని ప్రయత్నంచేస్తున్నాడు.

ఇంతలో నర్స్ అక్కడికొచ్చి నన్ను చూస్తూ 'నువ్వు ఈ పేషెంట్‌కేమౌతావ్?-' అడిగింది.

'ఏమీకాను. ఒకప్పుడు నేనీడి పెళ్లాన్ని. నన్నొదిలేసి... నేను అక్కర్లేదనుకుని... నన్నూ నా పిలగాడిని వదిలేసి ఎల్లిపోయిండు మరో ఆడదానితో... వీడికి రోగమొచ్చి ఆసుపత్రిలో వున్నాడని తెలిసి చూచిపోదామని వచ్చానంతే....' మనసులో మాట నర్స్‌తో చెప్పాను.

'ఇంతకూ నరసమ్మా... మావాడి కొచ్చిన రోగం ఏంది?' సత్తెమ్మ అడిగింది.

'వళ్లు కొవ్వెక్కి అంటగట్టుకున్న మాయరోగం...'

'మాయరోగమా? అదేంటి? - ' నోరు బార్లగ తెరిచి అంది సత్తెమ్మ.

'ఏమిటా?... ఎయిడ్స్ రోగం! అవతారం చూస్తున్నార్గు కదా... ఇవ్వాళో... రేపో... అనేట్టున్నాడు.

సమయానికి తాలికట్టిన పెళ్లాం వచ్చి చూచిపోతున్నందుకు ఇతను సంతోషించాలి!... హరీ అన్నాక శవాన్ని పెళ్లానికే అప్పగిస్తాం...' అనేసి తిట్టుకుంటూ నర్స్ వెళ్లిపోయింది.

'చావుబతుకుల్లో వున్న నన్ను చూడటానికి వచ్చావంటే ఆదెమ్మా!. నా మీద దయ కలిగిందా... ఎంత సెడినా నీ మొగుడిని కదా? నిన్ను చూశాక శానా ఆనందంగ వుంది. నా పని అయిపోయిందే ఆదెమ్మా... పిల్లాడిని కూడా వెంటబెట్టుకు వచ్చివుంటే ఆఖరి రోజుల్లో చూచి ఆనందించేవాడిని!. ఆడెట్టావున్నాడే? బాగా చదువుకుంటున్నాడా?. - నీకు పిల్లాడికి నేను తీరని అన్యాయం... కాదు ద్రోహం చేశాను. అందుకే దేవుడు నాకీ శిక్ష విధించాడు. ఈ స్థితిలో నన్ను ఇంటికి నీ వెంట తీసుకెళ్లమని అడగలేను. - కానీ... ఒక్క విషయం నీకు చెప్పాలే! అందుకే నీకోసం సత్తెమ్మతో కబురు పెట్టాను. - జాగర్తగా విను! - డిపార్ట్‌మెంట్ నాకు రావలసిన ప్రావిడెంట్‌ఫండు... గ్రాట్యువిటీ... పింఛను... నీకే చెందాలని నామినేషన్ ఫారాలు ఎప్పుడో ఆఫీసులో ఇచ్చాను. నేనుపోయాక డెత్ సర్టిఫికేట్‌తో ఆఫీసుకెళ్లి అయ్యగారిని కలిస్తే... నా తదనంతరం రావలసినవన్నీ నీకు అందచేస్తారు. పాపపరిహారంగ నేనిచ్చే కానుక నీకిదే... తప్పుసేసినందుకు సిగ్గుపడుతున్నాను. నన్ను క్షమించు... ' అని చెప్తూనే తుదిశ్వాస విడిచాడు మడేవేలు!

తాళికట్టిన మొగుడి చావును కళ్లారా చూడటాన భోరున ఏడవాలన్పించలేదు సరికదా అయ్యోపాపం అనైనా అన్పించలేదు. అయినా... కట్టుకున్నోడిని ఎంతగ అసహ్యించుకున్నా... అప్రయత్నంగ నా కళ్లు చమర్చాయి!

--- సమాప్తం ---